క్లుప్తంగా

ఘనంగా తిరునక్షత్ర పూజలు



అప్పన్న ఉత్సవమూర్తులు, మనవాళ్ మహామునులు

సింహాచలం: సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మనవాళ్ మహామునులు తిరునక్షత్రం పూజలు మూడోరోజు శనివారం కొనసాగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. దివ్యప్రబంధ పారాయణం పఠించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అధ్యాపకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సింహగిరి.. భక్త ఝరి



క్యూలో బారులు తీరిన భక్తులు

సింహాచలం: సింహగిరికి శనివారం భక్తులు పోటెత్తారు. కార్తీక శనివారం కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. దీంతో సింహగిరి భక్తులతో కిటకిటలాడింది. దర్శన క్యూలు, ప్రసాద విక్రయ కేంద్రాల వద్ద భక్తులు బారులు తీరారు. దేవస్థానం బస్సులు, ఆర్టీసీ బస్సులు రద్దీగా మారాయి.

మహాధర్నాకు తరలిరండి

పరవాడ: జాతీయ కార్మిక, రైతు సంఘాల పిలుపు మేరకు ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు కోరారు. లంకెలపాలెంలో శనివారం ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధరలు నియంత్రించాలన్నారు. ఆహారం, మందులు, వ్యవసాయ ఉపకరణాలపై జీఎస్టీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్‌లపై ఎక్సైజ్ పన్నులు తగ్గించాలని కోరారు. విజయవాడలో జరగనున్న మహాధర్నాలో భారీ ఎత్తున రైతులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, మండల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై వ్యాసరచన పోటీలు

సబ్బవరం: జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని తవ్వవానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శనివారం వినియోగదారుల రక్షణ చట్టంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించి ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్ ఎస్ రామకృష్ణ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మావతి, మిగిలిన ఉపాధ్యాయులు అనురాధ, సాయి కుమార్, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం



కోట్నివానిపాలెంలో గౌరమ్మ ఊరేగింపు

పెందుర్తి: మండలంలోని కోట్నివానిపాలెంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఉదయం నుంచి ఆది దంపతులకు ప్రత్యేక పూజలు చేశారు. పసుపు–కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధనలో దాదాపు వెయ్యి మంది అన్నప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం డప్పు వాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగింపు జరిగింది. అమ్మవారికి రకరకాల పిండివంటలు, ఫలాలతో సారె సమర్పించారు. కోలాటంతో మహిళలు ఆకట్టుకున్నారు. భక్తిశ్రద్ధలతో అనుపోత్సవం చేశారు.

అభిమాన తరంగం

- సామాజిక సాధికార బస్సు యాత్రకు తరలి వచ్చిన ప్రజలు
- భారీ బైక్ ర్యాలీతో కేరింతలు కొట్టిన యువతరం
- పెందుర్తి నుంచి సబ్బవరం వరకు మార్మోగిన జగన్ నినాదం



సీఎం వైఎస్ జగన్ మాస్కులు ధరించి బైక్ ర్యాలీలో పాల్గొన్న యువకులు



సబ్బవరం సభా ప్రాంగణంలో అభివాదం చేస్తున్న మహిళలు



వేపగుంట కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం బూడి, ఎమ్మెల్యేలు అదీప్‌రాజ్, ఉమాశంకర్ గణేష్, అధ్యక్షుడు బొడ్డేడ

పెందుర్తి: అటు పరవాడ సముద్రతీరం..ఇటు పెందుర్తి పట్టణం..మధ్యలో సబ్బవరం గ్రామీణం నుంచి తరలివచ్చిన జనంతో సబ్బవరం మూడు రోడ్ల కూడలి జాతరను తలపించింది. అన్ని మార్గాలు సామాజిక సాధికారబస్సు యాత్రకు వచ్చిన వారితో రద్దీగా మారాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 'జై' అంటూ నినదించారు. మరోవైపు సాధికార యాత్రగా వచ్చి ప్రతినిధులకు స్వాగతం పలుకుతూ యువతరం చేపట్టిన బైక్ ర్యాలీ హోరెత్తింది.

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో వేపగుంట నుంచి బస్సు యాత్ర ప్రారంభం కాగానే దాదాపు 300 బైక్‌లతో యువకులు ర్యాలీగా సాగారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాస్కులతో కేరింతలు కొట్టారు. దాదాపు ఐదు కిలోమీటర్ల మేర ర్యాలీ సాగింది.
- పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్దకు యాత్ర చేరుకోగానే వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో సహా ప్రజాప్రతినిధులకు విద్యార్థులు పూలవర్షంతో స్వాగతం పలికారు. కళాశాల భవనాన్ని ప్రారంభిస్తున్న సమయంలో విద్యార్థులు చప్పట్లతో హర్షధ్వానాలు తెలిపారు.
- భోజన విరామం అనంతరం ప్రారంభమైన బస్సు యాత్రకు పినగాడి నుంచి సబ్బవరం వరకు దారి పొడవున వై.వి సుబ్బారెడ్డి, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులకు ప్రజలు అభివాదం చేశారు.
- సబ్బవరం వేదిక వద్ద జనం పూలతో పాలకులకు స్వాగతం పలికారు.
- ప్రజల చప్పట్ల నడుమ వేలాదిగా కిక్కిరిసిన సభా వేదికపై మంత్రులు ఆశీనులయ్యారు.
- ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి మంత్రులు వివరిస్తున్న సమయంలో జనం శ్రద్ధగా విన్నారు.
- టీడీపీ అధినేత చంద్రబాబు, పెందుర్తి టీడీపీ నేత బండారు సత్యనారాయణమూర్తిపై ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తనదైనశైలిలో వేసిన పంచ్‌లకు వేదికపై ఉన్న ప్రజాప్రతినిధులు, జనం కడుపుబ్బా నవ్వుకున్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్, సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, ఎంపీపీలు బోకం సూర్యకుమారి, మదుపాడ నాగమణి, కార్పొరేటర్ ముమ్మన దేముడు,పార్టీ నియోజకవర్గ ప్రతినిధి కొటాన రాము, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోడిగుడ్ల దేవిసాంబ, పరవాడ జెడ్పీటీసీ పీఎస్ రాజు, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గొర్లె రామునాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు శరగడం నరసింహమూర్తి, అనకాపల్లి పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, వైస్ ఎంపీపీలు దాడి ఝాన్సీలక్ష్మి, చొక్కాకుల గోవింద, మాజీ ఎంపీపీలు సబ్బవరపు ముత్యాలనాయుడు, గొర్లి ఉమామహేశ్వరరావు, పార్టీ నాయకులు చుక్కా రామునాయుడు, బల్ల రాంబాబు, జోబ్‌దాస్, కాళ్ల గంగాధర్, కర్రి బాబు, కోన తాతారావు, యతిరాజుల నాగేశ్వరావు, గొరపల్లి శ్రీను, దాడి ఉమామహేశ్వరావు, బొడ్డు సూర్యప్రకాష్, ఇల్లపు ప్రసాద్, కిల్లి అప్పారావు, యడ్ల నాయుడు, వినోద్, చందుయాదవ్, చిప్పల చందు, కాపుశెట్టి శేషుబాబు, శరగడం రాము, సన్నీ తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న మహిళలు

తరలి వెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



సామాజిక సాధికార బస్సు యాత్రకు తరలివెళ్లిన బొద్దపువానిపాలెం గ్రామ ప్రజలు

పరవాడ: సబ్బవరంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తరలి వెళ్లారు. మాజీ మండల అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు ఆధ్వర్యంలో బొద్దపువానిపాలెం నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. మండలంలో భర్నికం, తానాం, లంకెలపాలెం, పెదముషిడివాడ, కన్నూరు, పరవాడ, వెన్నలపాలెం, రావాడ, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తదితర గ్రామాల నుంచి బస్సు యాత్రకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ చల్లా కనకారావు ఆధ్వర్యంలో బస్సులు, ఇతర వాహనాల్లో భారీగా కార్యకర్తలు, నాయకులు వెళ్లారు.

- వాడచీపురుపల్లి నుంచి లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, మండల వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, నాయకులు బండి ముత్యాలు, కూండ్రపు తాతాజీ, కార్యకర్తలు తరలి వెళ్లారు.
- జీవీఎంసీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు,పీతల అప్పలరాజు,పీతల విష్ణుమూర్తి ర్యాలీగా తరలివెళ్లారు.

పాలిటెక్నిక్ కళాశాల అదనపు భవనం ప్రారంభం



పాలిటెక్నిక్ కళాశాల అదనపు భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బూడి, వై.వి సుబ్బారెడ్డి, అదీప్‌రాజ్

పెందుర్తి: పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అదనపు భవనం ప్రారంభోత్సవం శనివారం ఘనంగా జరిగింది. రూ.8 కోట్ల సాంకేతిక విద్యాశాఖ నిధులతో నిర్మించిన ఈ భవనంలో ఏర్పాటు చేసిన తరగతి గదులతో పాటు ల్యాబ్‌లు, వర్క్‌షాప్ హాల్‌ను వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సాహితీ సముద్ధరణకు విశాలాంధ్ర విశేష కృషి



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న అతిథులు

మహారాణిపేట : విశాలాంధ్ర సంస్థ 50వ దశకం నుంచి సాహిత్యం ద్వారా సమాజంలో చైతన్యం పెంపొందించేందుకు విశేష కృషి చేస్తోందని ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. విశాలాంధ్ర 22వ పుస్తక మహోత్సవాన్ని స్థానిక టర్నర్ సత్రంలో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో నూతన ఒరవడి తీసుకురావడంలో విశాలాంధ్ర ఎంతో కృషి చేసిందని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విశాఖ బుక్ ఫెస్టివల్ నిర్వహించాలని ప్రయత్నాలు చేసినప్పటికీ అది సాధ్యం కాలేదని, ఆ లోటును భర్తీ చేయడంలో విశాలాంధ్ర ప్రదర్శన ముందు వరుసలో నిల్చుందన్నారు. మేనేజర్ టి. మనోహర్‌నాయుడు మాట్లాడుతూ విశాలాంధ్ర పుస్తక మహోత్సవాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రచయిత ఆచార్య సూర్యారావు, ఆచార్య సిమ్మన్న, హిమాన్షు ప్రసాద్, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు పాల్గొన్నారు.



మంత్రిపాలెం-మామిడివానిపాలెం గ్రామాల మధ్య వేసిన తారు రోడ్డు



పరవాడ-ఎన్‌హెచ్ 5 గ్రామాల మధ్య అభివృద్ధి చేసిన బీటీ రోడ్డు

ఇక రయ్.. రయ్

- మండలంలో ప్రధాన రోడ్లకు మహర్దశ
- రూ.3.57 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం
- సాఫీగా సాగుతున్న ప్రయాణం
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న మండల వాసులు

పరవాడ: మండలంలో అభివృద్ధి పరుగులు తీస్తోంది. దశాబ్దాల తరబడి కలగా మిగిలిన పనులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పూర్తి చేసి ఆ ప్రాంత వాసుల కళ్లలో ఆనందం నింపుతోంది. దీనిలో భాగంగా గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేసింది. గుంతలు, రాళ్లు తేలిన రోడ్లకు చికిత్స చేస్తోంది. గ్రామీణ రోడ్లను సైతం విస్తరించి అభివృద్ధి చేసింది. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో..

గత టీడీపీ పాలనలో రోడ్ల అభివృద్ధిని గాలికి వదిలేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు అష్టకష్టాలు పడేవారు. గుంతల వల్ల వాహనాలు దెబ్బతినడంతో పాటు ప్రమాదాలు జరిగేవి. వర్షాలు పడితే ఆయా మార్గాల్లో ప్రయాణం నరకప్రాయంగా మారేది.

నేడు అలాంటి రోడ్లను ప్రభుత్వం అభివృద్ధి చేసింది. కోట్లది రూపాయిలతో గ్రామాల రహదారులను ప్రధాన మార్గాలకు అనుసంధానం చేసింది. పలు రహదారులను జగనన్న ప్రభుత్వం అభివృద్ధి చేసి పల్లె ప్రజల కష్టాలకు చెక్ పెట్టారు.దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ రహదారులకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించడంతో మండలంలో ప్రధాన రోడ్లను రూ.3.57 కోట్లతో అభివృద్ధి చేశారు.

- గుంతలమయంగా తయారైన పరవాడ- ఎన్‌హెచ్ 5 రహదారిని ప్రధాన మంత్రి గ్రామీణ యోజన స్కీం (పీఎంజీఎస్‌వై) కింద రూ.2 కోట్ల వ్యయంతో సుమారు 4 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మించారు. దీంతో పరవాడ, తానాం, తాడి గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
- శిథిలావస్థకు చేరిన మంత్రిపాలెం-మామిడివానిపాలెం రోడ్డును ఏపీఆర్‌ఆర్‌పీ స్కీం కింద రూ.75.10 లక్షల వ్యయంతో బీటీ రోడ్డుగా తీర్చిదిద్దారు. ఫలితంగా మంత్రిపాలెం, మడకపాలెం, మామిడివానిపాలెం గ్రామాల ప్రజలకు అనేక విధాలుగా ప్రయాణ సౌలభ్యం కలిగింది.
- ఏళ్ల తరబడి గోతులతో నిండి ఉన్న వాడచీపురుపల్లి–ఇస్సన్నపేట గ్రామాల మధ్య మెటల్ రోడ్డును ఏపీఆర్‌ఆర్‌పీ స్కీం ద్వారా రూ. 82.60 లక్షల వ్యయంతో బీటీ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మెటల్ రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేయడంతో ఇస్సన్నపేట గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



వాడచీపురుపల్లి-ఇస్సన్నపేట గ్రామాల మధ్య నిర్మిస్తున్న బీటీ రోడ్డు

కల నెరవేరింది



అధ్వానంగా ఉన్న ఇస్సన్నపేట రోడ్డు అభివృద్ధి కోసం గ్రామస్తులంతా కలలు కనేవారు. గత ప్రభుత్వ హయాంలో నెరవేరలేని కల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నెరవేరుతోంది. ఇస్సన్నపేట బీటీ రోడ్డుకు ప్రభుత్వం రూ.82 లక్షలు మంజూరు చేసింది. నిర్మాణం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గ్రామ ప్రజలు తరఫున ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– కూండ్రపు ఉమామహేశ్వరి, ఇస్సన్నపేట

లింగ ఆధారిత హింసకు చెక్ పెట్టాలి



ర్యాలీలో పాల్గొన్న డీఈవో చంద్రకళ, అధికారులు



పెందుర్తిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

పెందుర్తి: విద్యార్థి దశ నుంచే లింగ ఆధారిత హింసకు చెక్ పడాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ అన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో లింగ అసమానత్వ సమస్యలకు వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. శనివారం పెందుర్తిలోని జిల్లా సమాఖ్య భవనంలో జరిగిన కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు ఎవరూ పాఠశాలకు దూరంగా ఉండకూడదన్నారు. బాల్య వివాహాలకు చెక్ పెట్టడానికి ప్రతీ ఒక్కరూ నడుం బిగించాలని చెప్పారు. మాతా శిశు సంక్షేమ శాఖ పీడీ డి.వెంకటేశ్వరి మాట్లాడుతూ పిల్లలను ఆడ, మగ తేడాచూపకుండా పెంచితే సమాజంలో అసమానతలు తొలగిపోతాయన్నారు. ప్రతీ కార్యాలయంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేసి పని ప్రదేశాల్లో హింస లేకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ ఎం.ఎస్ శోభారాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ ఏపీసీ బి.శ్రీనివాసరావు, అడిషనల్ డీఎంహెచ్‌వో సి.హెచ్ పూర్ణేంద్ర బాబు, డీపీఎంలు పి.అరుణకుమారి, బి.వైదేహి, ఎ.సి.కె సత్యంనాయుడు, జిల్లా సమాఖ్య సభ్యులు రేణుక, వల్లయ్య, శ్రీనివాసరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

మండల సమాఖ్య ఆధ్వర్యంలో..

గ్రామీణ పేదరిక నిర్మూలన, పెందుర్తి మండల సమాఖ్య ఆధ్వర్యంలో లింగ ఆధారిత హింస నిరోధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పెందుర్తి ఐసీడీఎస్ కార్యాలయం నుంచి బీఆర్‌టీఎస్ రహదారి వరకు జరిగిన ర్యాలీలో అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.వసంత, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, ఎంఈవో మధుమూర్తి, సీడీపీవో నీలవేణి, నోడల్ అధికారి శ్రీకర్, వివిధ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.